# మలుపు

ఆమె నా దగ్గరకు వస్తానన్నది... స్పిరిచ్యువల్ గైడెన్స్ కోసరం అయి ఉండాలి. వచ్చింది... దానికోసరంమాత్రంకాదు.

ఆశ్చర్యంగా ఉన్నది - ఆమె అంత భ్రాంతితో... ప్రాపంచిక విషయాల ప్రలోభంతో మాట్లాడుతూ ఉంటే...

"అనూ ముజుమ్‌దార్ సృష్టించిన 'పారలెల్ జర్నీస్'లో మైత్రేయి అంతటిదానివనుకున్నాను... ఏమిటి మరీ ఇలా...'

"మీరు యాజ్ఞవల్క్యుణ్ణి కూడా అనుకున్నారా?" ఒకరకంగా నవ్వుతూ అడిగింది... ఆ నవ్వులో చిలిపితనం పొర కప్పుకున్న ఏదో నిర్లిప్త తేజోమయత్వం.

కానీ... ఆ కాంతి నా అహంమీద కొట్టింది.

బుసకొట్టిన అహం... కుండలినీశక్తి అయి తేజోచక్రాలనే భాసింప చెయ్యనక్కర్లేదు. అధోముఖంగా ప్రయాణించి నేను 'నేను తనాన్ని' మరింత ప్రాభావితం చేయవచ్చు కూడా.

శూన్యత, సాంద్రత అనేవి చాలా అస్పష్టపు చీకట్లు. అందులో నిప్పచ్చరమే నిలకడ అనిపిస్తుంది. ఆధ్యాత్మిక దారుల్లో అహం ప్రయాణం అప్పుడప్పుడు ఈ నీహారికా స్వాంతనంతో 'మాయ' తోడుగా ప్రయాణిస్తూ పరుగందుకుంటుంది.

ఆవిడ వచ్చిన విషయం ఏదో స్థలాల కొనుగోలు విషయం. నా స్కూల్ ఆఫ్ థాట్‌కు పక్కనున్న స్థలం ఆవిడకు కావాలిట. బేరం కుదుర్చమన్నది.

చాలా వ్యవహారవేత్తలా మాట్లాడుతోంది, ఒళ్లు మండిపోయేటట్లు.

ఒకప్పుడు, "నీకు నేను ఒద్దా?" అని ఆరాటంగా అడిగి, ఒద్దు అనిపించుకున్న వ్యక్తి.

"నీకు నేను అక్కర్లేనప్పుడు, నేను ఎవరిదాన్నైనా ఒకటే..." అన్న ఈ మనిషి ఏమిటి ఇలా మారిపోయింది?!

ఆవిడకు నా ఇన్టలెక్చువాలిటీ మీద విపరీతమైన ఆరాధన ఉండేది. ఏ బాధనన్నా నాతో పంచుకోవడానికి వస్తూ ఉండేది.

"నా దుఃఖానికి కాదు అర్థం...నాకు నేను అర్థం వెతుక్కుంటున్నాను ప్రొఫెసర్‌గారూ!" అన్నది రెండేళ్ళ క్రితం వచ్చినప్పుడు.

ఆ క్రితంసారి వచ్చినప్పుడు భోరున ఏడ్చింది. ఆవిడకు ఎం.బి.ఎ. చదువుతున్న కొడుకు పోయాడట.

ఆ తరవాత చాలా చాలా మార్పులు.

నా పర్సనల్ గ్రోత్‌కు ఫ్యామిలీ అడ్డం అనిపించింది. తెగతెంపులు చేసుకొని చాలా చాలా చేస్తున్నాను.

నేను ఇప్పుడు యోగా, జెన్ సెంటర్స్‌కు హెడ్‌ను. ఆధ్యాత్మిక గురువును.

"నిరాదరణకు, దుఃఖానికి, ఐడెన్టిటీ క్రైసిస్‌కు ఒక మలుపు ఉంటుంది. ఆ మలుపు తిరిగేదాకానే ఈ బాధలు..."

ఎప్పుడూ చెప్పేవాణ్ణి ఆమెకు.

"ఎలా? ఏమిటి మారుస్తుంది నన్ను? ఏది ఎందులో ఎలా వెతుక్కోవాలి?" ఖోరున ఏడుస్తూ అడిగిన రోజులు ఉన్నాయి.

"ఇలా అని చెపితే నీకు అర్థంకాదు... జీవితంలో మీన్స్ అండ్ ఎండ్స్ ఒకటైనప్పుడు కలిగే చైతన్యం, స్ఫూర్తి - వాట్ యు కాల్ రియలైజేషన్... అది వచ్చేదాకా ఈ పోరాటం, ఈ ఆరాటం తప్పదు..." ఓదారుస్తూ చెప్పేవాడిని.

"అది వేరు... జీవితం... అంటే మనం జీవిస్తున్న జీవితం - ఇవి రెండూ వేరా?" ఆమె అమాయకంగా అడిగేది.

"అవును... నువ్వున్న సెన్సిటివ్ స్టేజ్‌లో అలాగే అనిపిస్తుంది. కానీ అది ఇదిగా, ఇది అదిగా మలుచుకోవాలి..." సూటిగా చూస్తున్న నా కళ్ళ నుంచి చూపు మరల్చుకునేది.

"మన చుట్టూ ఉండే చైతన్యశక్తితో మనస్సు లయమవడమే ధ్యానం అంటారు మీరు... ఆ స్థితి రావాలంటే స్వార్థం, అసూయ, అహం - ఇల్లాంటివన్నీ కంట్రోల్‌లో ఉండాలి అన్నారు సరే. అదెలా అని? ఏదన్నా పూజలు, వ్రతాలు..." అది నిజాయితీ గల ప్రశ్నో, లేక పరీక్షకు పెట్టే విమర్శో తెలియకుండా మాట్లాడే తెలివితేటలు ఆమెకు చాలా ఉన్నాయి.

"పూజలా? ఇంకా నయం... ఇది ఏ మతానికి, కులానికి సంబంధించింది కాదు... ఇది ఏ మనిషికి ఆ మనిషి సాధించుకునే స్థితి."

"రైటే-కానీ, ఒక్కసారిగా మనిషి తన వాతావరణం నుంచి బైట పడడుకదా! దాన్ని తప్పించి అతడికి 'చైతన్యం' ఇచ్చే స్పెషల్ పద్ధతి మీరేమైనా కనిపెట్టారా?!" సూటిగా అడిగింది.

"లేదు... అది అతడంతట అతడే తప్పించుకోవాలి..."

"ఇక్కడే ఉన్నది మెలిక... అది తప్పించుకున్న తరవాత మీలాంటి స్పిరిచువల్ గైడ్స్ హెల్ప్ చేస్తారా? అది తప్పించుకునేందుకు సహాయం చేస్తారా?!"

"ఒకసారి ధ్యానమార్గంలో పడ్డతరవాత అవన్నీ మెల్లిగా తొలిగిపోతాయి..... ప్రయత్నించకుండా అల్లరి చెయ్యకు..." మందలించాడు ఒకసారి.

బుద్ధిగా తల ఊపింది. బోలెడు పుస్తకాలు తీసుకువెళ్ళింది.

"పూర్వజన్మలు, కర్మలు, అనుభవాలు - ఇవన్నీ ఉన్నాయని అన్ని దేశాల్లోనూ చాటేస్తున్నారు కదా! ఇంక అనుభవించక తప్పనప్పుడు..." - ఒక సిలోన్ యువకుడు ప్రశ్నించాడు.

"అనుభవానికి సరిహద్దు లేదు... కానీ అనుభవించేటప్పుడు అవేర్‌నెస్ మనను మారుస్తుంది. మరొక పరిధికి తీసుకువెళుతుంది. ఇది బైటకు కనబడని మార్పు... ఈ అవేర్‌నెస్ కోసరమే ఈ ధ్యాసం అనుకుంటూ..." ఆమె జవాబు చెప్పింది.

ప్రశంసాపూర్వకంగా చూశాను.

ఆమె సర్వజీవితానికి అర్థం నా గుప్పెట్లో... నా పిడికిట పట్టులో... నా స్పర్శతో తప్ప చైతన్యంరాని బొమ్మ... నా ఊహల దారాలు కాంతిరేఖలైతే, వాటి పరిధిలో వెలిగే సీతాకోకచిలకలాగా నేను ఇచ్చే ఇంటలెక్చువల్ స్వేచ్ఛతో వెలుగుతూ ఉండేది ఆమె...

ఒకసారి వచ్చినప్పుడు-

నా చుట్టూ అమెరికన్స్, జర్మన్స్... దూరంగా నిలబడిపోయింది.

మన దేశంలో ప్రతి ఆధ్యాత్మిక గురువుకూ, వాళ్ళ చుట్టూ ఉండే ఈ నీలి కళ్ళ తెల్లబొమ్మలు విపరీతమైన 'విలువ' తెచ్చిపెడతారు.

నేను కొద్దిగా గర్వంతో పరిచయం చెయ్యబోయాను.

నమస్కారం చేసి వెళ్ళిపోయింది.

"మాష్టర్!... ఆవిడ ఆరా... చాలా అద్భుతంగా ఉన్నది... ఆవిడ ఎవరు?!" ఒక జర్మన్ కుతూహలంగా అడిగాడు.

ఉలిక్కిపడ్డాను నేను.

ఆ మధ్య ఆవిడ చాలా మేధావంతురాలిగా, ఆధ్యాత్మికత గురించి మాట్లాడుతున్న వ్యక్తిగా ఆ పరిధికి సంబంధించిన జనం మాట్లాడటం మొదలు పెట్టారు.

"ఆమె మీ శిష్యురాలుటగా?" అన్న ప్రశ్న నాకు చాలా చాలా సమస్యలు రేపింది.

ఔనో, కాదో అన్నట్లు తల ఊపేవాణ్ణి. ఆవిడ గొప్పగా తయారైతే, నన్ను గురువుగా చెప్పుకుంటే ఒప్పుకోవచ్చునుకానీ, ఏదైనా కాంట్రవర్సీగా తయారైతే?!... బాధ్యత నాదెలా అవుతుంది?!

నువ్వు గొప్ప గురువువి అయిపోతున్నావుటగా?!" అడిగాను.

నవ్వింది.

"నేను భగవత్‌దూతను... మిమ్మల్నందర్నీ రక్షించడానికే వచ్చాను..." అన్న ఆలోచన, స్కిజియోఫీనియాలో ఒక భాగం అని విన్నాను... ఏమంటారు దాన్ని? మాగ్లమానియానా?! అలా ఏమైనా తయారౌతున్నానా ఏమిటి ఖర్మ?!"

ఉలిక్కిపడ్డాను... ఆ మాటల్లో నిజాయితీకి.

"లేదు... నీ గురించి చాలా విన్నాను... నా దగ్గరకు నీ స్నేహితులు చాలామంది వస్తున్నారు..."

ఆలోచిస్తూ, ఎటో చూస్తూ తలకాయ అలవోకగా ఊపింది.

'ఇదంతా మీ గైడెన్స్' అని తప్పించుకుంటుంది అనుకున్నాను.

అంత నిష్పూచీగా లేదు మనిషి.

ఈ మధ్యకాలంలో...

ఆమెకు జీవితం పట్ల, అనవసరపు అవకాశాలపట్ల, వస్తుభ్రాంతిపట్ల చాలా చాలా యావ పెరిగింది అనిపిస్తోంది నాకు. హెచ్చరించాను ఆ విషయం.

"అనుభవం తప్పుకాదేమో!... పైగా, దాని నుంచి పారిపోవడం పిరికితనం... అనుభవం నుంచి ఏం మిగుల్చుకుంటున్నాం అన్నది ప్రజ్ఞ... అవునా?!" ఓరగా చూస్తూ అడిగింది.

"అంటే..." ఎక్కడికి దారితీస్తోందా అని ఆలోచిస్తూనే అడిగాను.

"ఇదంతా గొంగళిపురుగు సీతాకోకచిలకగా మారే ప్రాసెస్ కాదంటారా?" నవ్వుతూ అడిగింది.

ఒళ్ళు మండింది నాకు.

"గొంగళి పురుగులన్నీ సీతాకోకచిలకలవ్వాలన్న రూలు లేదు... అనుభవాలు అనుకుంటూ బంధనాలు పెంచుకుంటే అలాగే అంతంకూడా అయిపోవచ్చు..."

"అంటే బంధనాల మధ్య 'బ్రతికి' ఉండాలన్నమాట... అదేగా నేనూ అన్నది..." అంటూ నవ్వింది.

ఆ తరువాత ఆమె గురించి పట్టించుకోలేనంత బిజీ అయిపోయాను నేను.

"ఇదంతా ఇటాలియన్ మార్బుల్... ఒక శిష్యుడు తయారు చేయించి ఇచ్చాడు..."

సువిశాలమైన నా ధ్యానమందిరం చుట్టూ చూపిస్తూ చెప్తున్నాను ఆమెకు, మరొకసారి వచ్చినపుడు.

చెట్లు ముట్టుకు చూసింది.

"ఈ ఇండోర్ ప్లాంట్స్‌లో కొన్ని ప్లాస్టిక్‌వి... సింగపూర్ శిష్యుడి కానుక..."

నవ్వింది.

నలభై ఎకరాల సువిశాల ప్రాంగణంలో చాలా అద్భుతంగా పెరుగుతోంది. నా ఆశ్రమం.

టి.వి. ఛానల్ ఒకదానిలో పాతికవేల ఖర్చుతో ఈ నా ఆశ్రమం గురించి, ఇక్కడ జరిగే ఆధ్యాత్మిక, ఆధిభౌతిక వ్యాధి నివారణ గురించి చాలా చాలా చెప్పిస్తున్నాను.

జనానికి ఇటువంటి ఆధ్యాత్మిక రిసార్ట్స్ ఎంత అవసరమో?! నాకు వేల సంఖ్యలో దేశ విదేశాల శిష్యులు పెరిగిపోయారు.

చాలా చాలా బ్రాంచీలు కావలసి వస్తున్నాయి.

ఏదో ఆలోచిస్తూ కంటి నీరు తుడుచుకోవడం చూశాను ఆమెను.

"ఎందుకు?" ప్రశ్నించాను జాలిగా.

కంటి నీటిపొర నుంచి తలెత్తి చూసి పక పకా నవ్వింది.

"అదేమిటి? ఏడుపూ, నవ్వూ ఒకేసారి వస్తున్నాయా? ఏమిటి దాచాలని ఆ ప్రయత్నం?" ఆలోచిస్తూ అడిగాను.

"అబ్బే... ఏడుపు రావడానికి అనేక కారణాలు ఉంటాయి... కానీ, ఇంకా కన్నీళ్ళు రావడానికి కావలసిన స్పందన మిగిలి ఉన్నందుకు నవ్వు వచ్చింది... ఇది హిస్టీరియా కాదు... అంతా బ్రహ్మానందమే..." అన్నది.

"నీ దుఃఖాలకు కారణం నేను అడగను... చాలా దుఃఖాలకు కారణం బంధం... నిన్ను అన్నీ వదులుకోమని నేను అడగను కానీ, మీ ఊరు దగ్గర మెడిటేషన్ సెంటర్ పెడదామనుకుంటున్నాను... నువ్వు దాన్ని లీడ్ చెయ్యగలవా?" అడిగాను.

మళ్ళీ నవ్వింది.

"ఆ బ్రాంచ్ పేరేమిటి? దండకారణ్యమా? దహరాకాశమా?"

కొన్ని మాటలు మాడ్యులేషన్‌తో, ఒక రకపు విరుపుతో కోటి అర్థాలు ధ్వనిస్తాయి.

ఆమె చూపులో నిర్లిప్తికి, మెరుపుకు అలాంటి విరుపు కూడా ఉన్నది.

ఏమాశిస్తోంది ఈ మనిషి?!

"నువ్వు దండకారణ్యంలో ఉన్నావు... దహరాకాశానికి దారి చెప్పాలనే నా ప్రయత్నం..." ఆప్యాయంగా చూస్తూ అన్నాను.

అక్కడ కొంతమంది నా శిష్యులు జెన్ కొటేషన్సు, భగవద్గీత శ్లోకాలు చిన్న చిన్న బోర్డుల మీద దిద్దుతున్నారు.

వాళ్ళ దగ్గర కూర్చుని, వాళ్ళకు సహాయం చేస్తూ, నవ్విస్తున్న ఆమెనే చూస్తూ కూర్చున్నాను.

మనిషిలో వ్యక్తమయ్యే పసితనం... అది చాలా గొప్పది... ఈమెను ఒకప్పుడు ఇన్‌స్పిరేషన్స్ కమిట్‌మెంట్ కాకూడదని దూరం చేసుకున్నాను.

పెళ్ళిళ్ళ విధానంలో ఇన్‌స్పిరేషన్ హక్కుల గుప్పిళ్ళలో నలిగి ఆవిరైపోతుందని తెలియచెప్పాను.

అయినా 'పెళ్ళి'లో ఇరుక్కున్నది. నేను ఆ వలయం నుంచి సులభంగా బైటపడ్డాను... మొగవాణ్ణి కాబట్టేమో... కానీ, ఆమెకు తామరాకు మీద నీటి

బొట్టులాగా బ్రతకడం రావడంలేదు... మరింత, మరింత కూరుకుపోతోంది పాపం. ఆమె రాస్తున్న బోర్డ్ చూశాను.

In not being able to get it, you get it.

When you are silent, it speaks.

When you speak it is silent.

తలకాయ ఎత్తి చూసి నవ్వింది... ఎన్ని అర్థాలు ఆ నవ్వులో!

మర్నాడు మధ్యాహ్నానికి రియల్ ఎస్టేట్‌వాళ్ళతో బిజినెస్ సెటిల్ చేసుకుని భోజనానికి ఆశ్రమానికి వచ్చేసింది. మిగతా ఫార్మాలిటీస్ నా పలుకుబడిగల శిష్యులు, ఆవిడ మేనేజర్ చేస్తారు.

"మీ ఫారిన్ కారులో ప్రయాణం చాలా హాయిగా ఉన్నది..." అన్నది.

నవ్వాను.

"ఏమిటి అలా నవ్వుతున్నారు? నాకు ఇలాంటి చిన్న చిన్న విషయాలు ఎలా తృప్తినిస్తాయా అనా?! ప్రతిక్షణంలోనూ జీవించాలిగా మరి..." అన్నది.

ఆవిడ ఒళ్ళు విరుపులో హాయిని గమనిస్తున్నాను.

"మీకు తెలుసా? నేను డాన్స్ నేర్చుకుంటున్నాను..." అన్నది గభాలున.

"అదేమిటి?" అప్రయత్నంగా అడిగాను. వెంటనే,

"నేర్చుకోకూడదని కాదుగానీ..." అన్నాను సర్దుకుంటూ.

"ఇప్పుడు మీకు రుక్మిణీ అరెండేల్ గురించి చెప్పి డాన్స్‌కు వయస్సుకు సంబంధంలేదని, యోగము, నృత్యము, ఆత్మానందము వగైరా చెప్పి మిమ్మల్ని భయపెట్టను లెండి... ఎవరో స్వామీజీ మనలో నిద్రిస్తున్న అంతర్గత చైతన్య వాహినులు ఒక్కసారిగా ఏ ఇన్హిబిషన్స్ లేకుండా చేసే బాడీ మూవ్‌మెంట్స్ వల్ల నిద్ర లేస్తాయి అన్నారు... అదేదో చూద్దామని..." చిలిపిగా అన్నది.

"ఈ అడ్డమైన మెడిటేషన్ విధానాలు, ఆధ్యాత్మిక అడ్డదారులూ... సారీ... అన్ని ఆశ్రమాలూ ఒక రకంగా ఉండవు... ఆ స్వామీజీ గురించి, ఆయన సంబంధాలను గురించి చాలా చాలా విన్నాను... అనవసరంగా మెంటల్‌రెక్స్ అయి అక్కడినుంచి, ఇక్కడికి వస్తున్నారు జనం... జాగ్రత్త!..." హెచ్చరికగా అన్నాను.

నా గొంతులో భీతి కనిపెట్టి నవ్వింది.

"దేన్ని గురించి భయపడుతున్నారు మీరు? మానవ సంబంధాల గురించా? మానసిక అనుబంధాల గురించా?"

ఒళ్ళు మండింది నాకు.

"చెప్పలేం... ఒకదాంట్లో నుంచి ఒకటి వస్తే..."

"భయపడకండి... ఆశ్రమమే కావల్సివస్తే..."

"అవును... నువ్వు ఇక్కడ చేరవచ్చు కదా!"

వెనక్కు తిరిగింది ఆమె ఆ మాటలు విని.

తెల్లటి చీరలో, రవ్వల దిద్దులతో... వైష్ణవి. ఆమె ఆడబడుచు... నా శిష్యురాలు... ఆశ్రమవాసి... ఆవిడ వచ్చిన తరవాత ఈ సెంటర్లో చాలా అందాలు, మార్పులు, ఆవేశాలు, ఆరాధనలు పెరిగాయి.

"అరె... మీరా వదినా? ఇవిగో, మీకు ఒక వది తెల్లచీరలు తెచ్చాను..."

"థాంక్స్... వీటికోసమే నీకు రెండుసార్లు ఫోన్ చేయించాను..."

వైష్ణవి ఆమెవంకే పరిశీలనగా చూస్తోంది.

ఏదో గులాబీరంగు చీరలో విచ్చుకున్న భ్రాంతిలా ఉన్నదామె.

"హాయిగా నువ్వు కూడా తెలుపు చీరలలోకి మారిపోకూడదూ?" ఓరగా నన్ను చూస్తూ అన్నది వైష్ణవి.

పకపక నవ్వింది ఆమె... ఆ నవ్వు వెలుతురు రతనాల వెల్లువలా ఆ స్పందనలేని పాలరాతి మందిరాన్ని జలదరింపచేసిందో, పులకింపచేసిందో చెప్పలేను.

ఆశ్రమంలో ఆ నవ్వు... కొంచెం కష్టమే... ఇద్దరు ముగ్గురు తొంగిచూసి మౌనంగా వెళ్ళిపోయారు.

"వదినా! మీరు తెల్లచీరలో హాయిగా ఉన్నాననుకుంటున్నారు... నేను ఏ చీరలోనైనా హాయిగా ఉంటాను... తప్పదుగా వదినా!... మీకు ఆశ్రమం ఉన్నది మరి..."

అర్థంకాలేదు వైష్ణవికి... అసూయ తెలిసిన కొంతమంది ఆడవాళ్ళకు చాలా చాలా అర్థం అవడం మానేస్తాయి.

చీరలు లెక్క పెట్టుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది వైష్ణవి. ఆమె కూడా వెళ్లిపోయింది 'నిద్ర వస్తోంది' అంటూ.

"ఆవిడ కొన్న స్థలం మన ఆశ్రమానికే ఇస్తుందా గురువుగారూ! అందుకే బోలెడు ఇన్ఫ్లుయన్స్ ఉపయోగించాను... అంతా వేస్ట్ అయిపోతుందా?" ఆశగా అడిగాడు నా దబ్బు, వలుకుబడి ఉన్న శిష్యుడు ఆమె వెళ్ళిన వైపే చూస్తూ.

చాలా ఇబ్బందికరమైన ప్రశ్న... ఎలా అడుగుతాను ఆమెను? నిజానికి ఆ స్థలం వస్తే స్కూలు పెట్టచ్చుమరి.

కానీ, ఆవిడ భర్త పెద్ద రాజకీయవేత్త!

మాటల సందర్భంలో, ఆ స్థలం ఆయన గెస్ట్‌హౌస్‌కు అని చెప్పినట్లు గుర్తు.

❀ ❀ ❀

ఆ సాయంత్రం...

ప్రశాంతంగా ఉన్నది వాతావరణం.

అశ్వత్థ కింద కట్టిన అరుగు మీద కూర్చున్నాము మేమిద్దరము.

ఆమె చాలా సేపటినుంచీ అక్కడే కూర్చుని ఉన్నది. నేను మూడు మెడిటేషను క్లాసులు తీసుకుని వస్తున్నాను.

అలుపుగా ఉన్నది నాకు. అంతమందికి 'రిలాక్సేషన్ థెరపీ' ఇచ్చే నాకు రిలాక్స్ అవ్వడం ఎంత కష్టమో తెలుసు.

చల్లగా నవ్వింది ఆమె నావంక చూసి.

దూరం నుంచి భగవద్గీత శ్లోకు... పక్షుల కుహూ కుహూ రవాల నుంచి శ్రావ్యంగా... అలౌకికంగా.

"మీ విభూతి యోగం కన్న నా అనుభూతి యోగం చాలా గొప్పది..." అని ఒకప్పుడు ఆమె చేసే అల్లరి గుర్తుకు వచ్చింది.

కాలం, వయస్సు, సమస్యలు, పరిస్థితులు - వీటి మధ్యలో చటుక్కున గుర్తుకు వచ్చే జ్ఞాపకాల శకలాలే జీవితంలో సారమా?! అవే మిగులుతాయా?!

"చాలా చల్లగా, హాయిగా ఉన్నది కదా..." ఆలోచనలు దాచేసుకుంటూ అన్నాను.

"అవును..." చిన్న చిన్న మాటలు అతి మెత్తగా పేరుస్తూ, సూటిగా చూస్తూ అన్నది ఆమె.

"అవును... ఇవి పాలరాతి మీదుగా వీచే అమానుషమైన చల్లదనం, ఆలోచనల వక్రీభూత చల్లదనం, బలవంతపు మౌనం, బాహ్య ప్రశాంతత, అంతర్ఘోషనించి ఆరంభించిన మెడిటేషన్ గదుల చల్లదనం కాదు ఇది... ఎక్కడి చల్లదనమో, హాయోకాదు... ఎప్పుడూ మన చుట్టూ ఉండేదే... మనం ట్యూన్ అయితే వెంటనే అనుభవంలోకి వచ్చేది..."

ఆ మాటల్లో... ఏదో శక్తి... ఏదో సందేశం. చల్లటి మంచుగడ్డ ఖణేల్మని విరిగినట్లు, లోపల, లోలోపల, అంతఃచేతనలో ఏదో... ఏదో కల్లోలం... ఘోష... ఎక్కడో నిర్లిప్త చైతన్యం నిర్జీవమైపోకుండా వెలుగు రూపం దాల్చడానికి జరుగుతున్న మహాయజ్ఞం... ఎక్కడి లోకాలకో దివ్య ఆవాహన... ఏవో మెరుపులు దాటిన పయనం.

తెలియకుండా నా కళ్లు మూసుకుపోతున్నాయి. ఏదో, ఏమిటో జరుగుతోంది... ఏది?... ఏమిటి?....

నా అలుపా? నా జిజ్ఞాసా? అసంతృప్తా లేక ఆమె... ప్రకృతిలో లయమౌతున్న ఆమె సన్నిధా?!

ఏది నన్ను కాన్షియస్ లెవల్ దాటించి... లాజిక్‌ను మరిపించి,
నిద్ర ఓడ ఎక్కించి,
అనుభూత ద్వీపాలను ఒరుసుకుంటూ.
ఊహల సంద్రాల అంచులు స్పృశిస్తూ,
గమ్యం తెలియని కాంతి ప్రయాణంలోకి... లోలోనికి...
ఎప్పుడు కళ్లు తెరిచానో అర్థంకాలేదు.
ఏమిటీ ప్రశాంతత?! నాలో... నా చుట్టూ...
ఒళ్లు విరుచుకుంటూ తల విదిలించాను.

"ఏమైంది స్వామీ?" అల్లరిగా అడిగింది.

ఆగిపోయాను నేను. ఏదో అనబోయి మెల్లిగా అడిగాను సూటిగా చూస్తూ:

"ఏమైంది నాకు?"

"అప్పటి నుంచీ చాలా అలౌకికంగా ఉండిపోయారు... ఏమైందిట... ప్రకృతీ దేవత మీకు ఇచ్చిన మెడిటేషన్ క్లాసుకు ఛార్జ్ ఎంతట?! మీరైతే ఏ మూడు వేలో అడుగుతారు అనుకోండి..."

ఛమక్‌మని ఏదో విద్యుత్ కొరడాతో వెలిగిన కాంతివలయం నన్ను తాకినట్లనిపించింది... ఆ స్పర్శ... నా చుట్టూ... చాలా అబ్‌స్ట్రాక్ట్‌గా... ఏదో అనుభూతి... ఇది చెప్పలేని... ఇది అని చెప్పలేని జలదరింపు... దానిలోనుంచి ఒక మెలుకువ.

"ఏం చేశావు నువ్వు నన్ను..." అప్రయత్నంగా అడిగాను.

"మీరు చెప్పిన 'మలుపు'... నాలో రావలసిన మార్పు... నేను... ప్రయాణానికి సిద్ధమైపోయాను... మరి మీరు వస్తారా?!"

ఆ కప్పర కప్పర చీకట్లో ఈ వెలుతురు.

ఇదొకరకమైన డివైన్ హిప్నోటిజమ్. ఏమి తెలుసు అసలు నాకు ఈమె గురించి?! ఎంత తెలుసనుకుని పొరబడ్డాను?! ఇంత ప్రశాంతత దొరికితే... ఎక్కడికి పోతే ఏం?!

"వస్తాను..." చటుక్కున లేచి నిలబడ్డాను.

దూరంగా శంఖానాదం...

నవ్వుతూ తల ఊపింది అడ్డంగా... రాలేవు అన్నట్లు.

ఒక్కసారి ఉలిక్కిపడి చూశాను... శాంతి... కాంతి... రెండూ చెదిరాయి.

చుట్టూ చూశాను. మామూలు చీకటి.

"అవును... రాలేను... నన్ను నమ్ముకుని ఇంతమంది మనుష్యులు, ఈ ఆశ్రమం, ఈ మెడిటేషన్ సెంటర్స్..."

నవ్వింది ఆమె...

"రావద్దు... అయినా, ఈ ప్రయాణానికి ఈ అనుబంధాల నుంచి పారిపోవడం కన్న అంతఃప్రయాణం అవసరం... అవునా... మన లోపలి దండకారణ్యాలను చీల్చుకుని దహరాకాశానికి ప్రయాణం... ఆశ, కోపము, అసూయ, అహం... ఇవి ఉంటే ఆశ్రమం అయినా ఒకటే... అవతల ప్రపంచం అయినా ఒకటే... ఈ ప్రయాణం సాగదు...

"నేను అడిగింది ఆ ప్రయాణం గురించి..."

ప్రశాంతంగా చూస్తున్న ఆమెను అర్థం చేసుకోవడం... ఎంత కష్టం?!

"ఎప్పుడు ఎదిగిపోయావు ఇలా?"

నవ్వింది...

"అంటే... ఇదొక ప్రాసెస్... ఎదగడం, ఆగడం ఉండదుగా... మీన్స్ అండ్ ఎండ్స్ ఒకటేనేమో కదూ! ఇవన్నీ మీ మాటలేగా..."

మాటలు... మాటలు నావే... అర్థాలు అనుభవాలు ఎవరివి?! ఎవరి సొంతం?!

"రియల్ ఎస్టేట్ ఏజెంటు వచ్చారు... మీరు వస్తారా మేడం?..." ఆమె మేనేజర్.

"పద... వస్తున్నాను..."

గబ గబ అడుగులు వేస్తూ ఆమె 'మలుపు' తిరిగింది.

మరి నేను?!

*('రచన' ప్రతిష్ఠాత్మక జన్మదిన ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి, 1999)*